క్లుప్తంగా

స్పీకర్‌కు మద్దతుగా తీర్మానం



కోటగిరి (రుద్రూర్): బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో మద్దతు తెలుపుతూ కోటగిరి ఉమ్మడి మండల గౌడ సంఘ సభ్యులు తీర్మానం చేశారు. ఈమేరకు శుక్రవారం వారు బాన్సువాడలో స్పీకర్‌ను కలిసి ఏకగ్రీవ తీర్మాన ప్రతిని అందజేశారు. సంఘ నాయకులు గంగాధర్‌గౌడ్, కాషాగౌడ్, శ్యాం సుందర్‌గౌడ్, అరుణ్‌కుమార్‌గౌడ్, గంగాప్రసాద్‌గౌడ్, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



నవీపేట: మండలంలోని పోతంగల్ గ్రామంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ విశ్వరూప బహిరంగ సభ కరపత్రాలను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆకారం రమేష్ మాట్లాడుతూ.. నవంబర్ 7న హైదరాబాద్‌లో జరుగనున్న ఎమ్మార్పీఎస్ విశ్వరూప బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 22న జిల్లాకేంద్రంలో తలపెట్టిన సన్నాహక సభకు మందకృష్ణ మాదిగ హాజరవుతారని, జయప్రదం చేయాలని కోరారు. నాయకులు జీవన్, లక్ష్మన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



బోధన్: పట్టణంలో ఎన్డీఎస్‌ఎల్ ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 77వ రోజు కొనసాగాయి. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. తమకు రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు నాగరాజు, వికారుద్దీన్, నాగేశ్వర్‌రావు, నయిమోద్దీన్ పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడిని ఖండిస్తున్నాం



బోధన్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇజ్రాయిల్ మారణహోమాన్ని మానవతావాదులు ఖండించాలని కోరారు. నాయకులు పడాల శంకర్, సాయిలు పాల్గొన్నారు.

ప్రశాంత్‌రెడ్డికి పరామర్శ



వేల్పూర్: మంత్రి ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల మరణించగా, ఆయనను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారి, ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కుర్మాచలం, బుద్ధవనం ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ మల్లేపల్లి లక్ష్మయ్య, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ రిక్క లింబాద్రి, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్ పాల్గొన్నారు. వారు మంజులమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



కమ్మర్‌పల్లి/వేల్పూర్: మండలంలోని కోనాపూర్ బీజేపీ అధ్యక్షుడు ముస్కు రాజశేఖర్‌రెడ్డి, నాయకుడు సంతోష్‌రెడ్డితో పాటు వారి అనుచరులు సుమారు 30 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వేల్పూర్‌లోని మంత్రి ప్రశాంత్‌రెడ్డి నివాసంలో శుక్రవారం వారికి పార్టీ రాష్ట్ర నాయకుడు కోటపాటి నర్సింహానాయుడు గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు.





చౌట్‌పల్లిలో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు.. కౌల్‌పూర్‌లో కలశ పూజ చేస్తున్న అర్చకులు.. రుద్రూర్‌లో చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు



ఆర్మూర్‌లోని పోచమ్మ గల్లీలో..



రుద్రూర్‌లో..

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన.. హోమాలు

సాక్షి నెట్‌వర్క్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు శుక్రవారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల వద్ద భక్తులు కుంకుమార్చనలు, మహా చండీ హోమాలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందిపేట మండలంలోని కౌల్‌పూర్ గ్రామంలోగల భూమయోగేశ్వర ఆశ్రమంలో అమ్మవారికి కలశపూజ, హోమం నిర్వహించారు.

రుద్రూర్‌లో అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించారు. ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి, తానాకలాన్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల వద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. నవీపేటలోని భక్త మార్కండేయ మందిరంలో కొలువుదీరిన దేవిమాత ఆలయానికి రూ. లక్ష నగదు అలంకరించారు. అలాగే సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.



ఆర్మూర్‌లో దుర్గామాత మండపం వద్ద కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు



రుద్రూర్‌లో పల్లకీసేవలో పాల్గొన్న ప్రజలు



తాడ్‌బిలోలిలో యజ్ఞం నిర్వహిస్తున్న గ్రామస్తులు



ఎడపల్లిలో భక్తులకు అన్నదానం



కుర్నాపల్లిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నవీపేటలో నోట్లతో అమ్మవారికి అలంకరణ



నవీపేటలో సామూహిక అక్షరాభ్యాసం

ఓట్లు అడిగే అర్హత ఎమ్మెల్యేకు లేదు

మాక్లూర్: ప్రజల్ని ఓట్లు అడిగే నైతిక హక్కు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి లేదని బీజేపీ ఆర్మూర్ నియోజకవర్గ నాయకుడు పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి, డీకంపల్లి, కల్లేడి గ్రామాలలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి, మాట్లాడారు. ఆర్మూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏమిలేదన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పాలనంత కేంద్రం ఇచ్చే పంచాయతీ నిధులతోనే గడిచిందన్నారు. బీజేపీకి అవకాశం ఇస్తే వివక్షతలేని పాలన అందిస్తామన్నారు. అంతకుముందు గ్రామస్తులు పైడి రాకేష్‌రెడ్డికి గ్రామ పొలిమేరా నుంచి డప్పు వాయిద్యాలు, మంగళహారతులతో స్వాగతం పలికారు. నాయకులు సురేష్‌నాయక్, పాలేపు రాజు, మారంపల్లి గంగాధర్ పాల్గొన్నారు.

నందిపేట్(ఆర్మూర్): రానున్న ఎన్నికలలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ఆర్మూర్ నియోజకవర్గ నాయకుడు పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కంఠం గ్రామంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం వంటి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. నాయకులు భూతం సాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో ఓట్లు అభ్యర్థిస్తున్న పైడి రాకేష్‌రెడ్డి

అభివృద్ధే ధ్యేయంగా పనిచేశా.. గెలిపించండి




మారంపల్లిలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి.. అడవి మామిడిపల్లిలో..

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి
- పలు గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర

మాక్లూర్: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేశానని, రానున్న ఎన్నికల్లో భారీ మేజార్టీతో గెలిపించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ప్రజల్ని కోరారు. మండలంలోని అడవి మామిడిపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన ప్రజా ఆశీర్వాద యాత్రలో పాల్గొని మాట్లాడారు. మూడోసారి గెలిపిస్తే కుటుంబాల వారిగా అభివృద్ధికి చేయూతనిస్తానని చెప్పారు. ఎంపీపీ మాస్త ప్రభాకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బడుగు సత్యం, సర్పంచ్ చింత మల్లారెడ్డి, నాయకులు పురుషోత్తం, గంగారాంలు పాల్గొన్నారు.

నందిపేట్ మండలంలో..

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని షాదీఖానాలో శుక్రవారం వికలాంగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పాల్గొని, మాట్లాడారు. వికలాంగుల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. దివ్యాంగులను తండ్రిలా కాపాడుతున్న నాయకుడు కేసీఆర్ అన్నారు. మండలంలోని వెల్మల్ గ్రామానికి చెందిన బోగ రాము బీజేపీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. మీసాల సుదర్శన్, ఉల్లి శ్రీనివాస్‌గౌడ్, మచ్చర్ల సాగర్, మాన్పూన్ భూమేష్, ఎర్రం ముత్యం, బొడ్డు రాజశేఖర్, ఎర్రటి మోహన్, మహేందర్ పాల్గొన్నారు.

డొంకేశ్వర్ మండలంలో..

డొంకేశ్వర్(ఆర్మూర్): ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మండలంలోని మారంపల్లిలో 'ప్రజా ఆశీర్వాద యాత్ర'ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. జీవన్ రెడ్డి బుల్లెట్ నడుపుతూ గ్రామానికి చేరుకోగా, ఆయనకు సతీమణితో కలిపి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ... అనేక సంక్షేమ పథకాలు గ్రామ ప్రజలకు అందాయని, ఊరి అల్లుడిని కావడంతో ప్రత్యేక శ్రద్ధతో పనులు చేసిపెట్టినట్లు తెలిపారు. మారంపల్లికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సర్పంచ్ లోక సత్తెవ్వ, ఉప సర్పంచ్ అర్గుల రవి, ఎంపీటీసీ పొట్టవత్రి రాజగంగు జనార్ధన్, జెడ్పీటీసీ ఎర్రం యమునా ముత్యం పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

బోధన్‌టౌన్: రాబోయే శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు పార్టీ పథకాలను ప్రజలకు వివరించారు. తొమ్మిదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో, బోధన్ నియోజక వర్గంలో చేసింది ఏమి లేదన్నారు. నాయకులు పాషా మోయినొద్దిన్, తలారి నవీన్, దాము, పోశెట్టి, రిజ్వాన్, చిరంజీవి, వహీద్, దీనదయాల్ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తొమ్మిది నియోజకవర్గాల్లో పోటీ చేస్తాం

బోధన్: అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని తొమ్మిది నియోజక వర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులను పోటీలో నిలబెడతామని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రాజుగౌడ్ వెల్లడించారు. పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో శుక్రవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగరాజు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముప్పై ఏళ్లు కాంగ్రెస్, పదేళ్లు బీఆర్‌ఎస్ అధికారంలో ఉండి నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓట్లు అడిగే నైతిక అర్హత లేదని పేర్కొన్నారు. ఉద్యమకారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి పాటుపడే వ్యక్తులనే తమ పార్టీ అభ్యర్థులుగా (సింహం గుర్తు)నిలబెడుతామని పేర్కొన్నారు. నాయకులు రాజన్న, బుల్లబ్బాయి, వీరేశం, రాజశేఖర్, గంగాప్రసాద్ పాల్గొన్నారు.



బోధన్‌లో మాట్లాడుతున్న రాజుగౌడ్

బియ్యం వితరణ



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లిలోని దుర్గామాత మండపం వద్ద నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి గ్రామానికి చెందిన మైనార్టీ నాయకుడు ఎండీ సలీం శుక్రవారం క్వింటాలు బియ్యాన్ని వితరణ చేశారు. వీడీసీ సభ్యులు లక్కారం నరేష్, మేడిదాల ప్రవీణ్ గౌడ్, గుర్రాల గంగామోహన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	టైగర్ నాగేశ్వరరావు(తెలుగు) – 9.40, భగవంత్‌కేసరి(తెలుగు) – 4.10 లియో(తెలుగు) – 10.30
స్క్రీన్-2 –	లియో(తెలుగు) – 11.15, 2.40, 6.05, 9.30
స్క్రీన్-3 –	భగవంత్ కేసరి (తెలుగు) – 11.55, 3.20, 6.45, 10.10
స్క్రీన్-4 –	టైగర్ నాగేశ్వరరావు (తెలుగు)–11.15, 2.50, 6.25, 10.00

బీజేపీతోనే సుపరిపాలన సాధ్యం

బోధన్: బీజేపీతోనే సుపరిపాలన, అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం, సంక్షేమం సాధ్యమవుతుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి అన్నారు. చాయ్‌పే చర్చ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కల్దుర్కి, సాలూర మండలంలోని హున్సా గ్రామంలో ఆయన పర్యటించారు. దుర్గామాత మండపాల్లో అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనులకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిధులు ఇస్తోందన్నారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించాలని కోరారు. కల్దుర్కిలో కుట్టుమిషన్‌పై బట్టలు కుట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మేడపాటి ప్రకాష్ రెడ్డి

ఘనంగా బతుకమ్మ సంబురాలు



కొలిప్యాక్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



దుర్గామాత బతుకమ్మతో మంచాల శంకరయ్య ట్రస్ట్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి

జక్రాన్‌పల్లి: మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో శుక్రవారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చారు. ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేసి, మహిళలు, యువతులు నృత్యాలు చేస్తూ బతుకమ్మ ఆడారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకువెళ్లి చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

ఖలీల్‌వాడి: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళ డాక్టర్లు, సిబ్బంది బతుకమ్మ పండుగ నిర్వహించారు. జీజీహెచ్‌లో బతుకమ్మ పాటలు పాడుతూ కోలాటాలు వేశారు. అనంతరం బతుకమ్మను నిమజ్జనం చేశారు. జీజీహెచ్ సూపరిండెంట్ ప్రతిమ రాజ్, ఏడీ సంతోష్, తదితరులు ఉన్నారు.



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో..

బీజేపీలో పలువురి చేరిక..

ఇందల్వాయి: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు బీజేపీ చేరారు. గ్రామంలో వారికి శుక్రవారం పార్టీ రూరల్ ఇన్‌చార్జి కులాచారి దినేష్ బీజేపీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు నాయిడి రాజన్న, ప్రదీప్ రెడ్డి, శ్రావణ్, వాసు పాల్గొన్నారు.

ముగిసిన సండే స్కూల్ టీచర్స్ ప్రోగ్రాం

వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో గల చర్చిలో శుక్రవారం సండే స్కూల్ టీచర్స్ ప్రోగ్రాం ముగిసింది. ఈసందర్భంగా కార్యక్రమంలో మండల పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రెవరెండ్ సీయోన్ కుమార్ పాల్గొని, మాట్లాడారు. హైదరాబాద్ సిస్టర్ ఝాన్సీ రీచర్డ్ పిల్లలకు శిక్షణ నిర్వహించారు. నోవా, ఐజాక్, జాన్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

రామడుగు ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల

ధర్పల్లి: మండలంలోని రామడుగు ప్రాజెక్టులో చేప పిల్లలను తహసీల్దార్ మాలతి గంగపుత్రులతో కలిసి శుక్రవారం విడుదల చేశారు. ప్రభుత్వం ద్వారా వంద శాతం సబ్సిడీపై చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఆర్‌ఐ రవి, గంగపుత్ర సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

ఖలీల్‌వాడి: ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున పట్టణంలో పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు, ఇతర కార్యక్రమాలలో డీజేలకు అనుమతి లేదని, ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ నరహరి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని పట్టణ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన డీజే యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎవరైనా డీజేలు పెట్టినట్టయితే వారి మీద చట్టరీత్యా చర్యలు తీసుకోవడమే కాకుండా వాటిని సీజ్ చేసి కోర్టులో ఉంచుతామన్నారు.

నియామకం



డిచ్‌పల్లి: మండలానికి చెందిన శ్రీనివాస్ గౌడ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఓబీసీ అధ్యక్షుడు రాజా నరేందర్‌గౌడ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు, సహకరించిన నాయకులు భూపతిరెడ్డి, నగేష్‌రెడ్డి, అరికెల నర్సారెడ్డి, శేఖర్‌గౌడ్, అమృతాపూర్ గంగాధర్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బీజేపీకి విద్యాసాగర్ రాజీనామా

డిచ్‌పల్లి: బీజేపీ సీనియర్ నాయకుడు ప్రొఫెసర్ గోపాలం విద్యాసాగర్ శుక్రవారం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో ఇమడలేక రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం.